


## నెలనెలా నవ్వుల పండగ

## మల్లాది వెంకటకృష్ణమూర్తి స్పెషల్

**ముగ్గురు** సరదాగా చేపలు పట్టడానికి ఓ చెరువుకి వెళ్ళారు. ముగ్గురూ పట్టిన చేపల్లో ఒకటి దేవతాకన్య. తనని విడిచిపెడితే ముగ్గురూ కోరే మూడు కోరికలు తీరుస్తానంది. మొదటివాడు తన మేథస్సుని రెట్టింపు చేయమన్నాడు. అందుకామె ఒప్పుకుని ఆ కోరికని తీర్చింది. ఇది చూసి రెండోవాడు తన మేథస్సుని మూడింతలు చేయమని కోరాడు. అందుకు కూడా ఆమె ఒప్పుకుని అతని కోరిక తీర్చింది.



మూడోవాడు తన మేథస్సుని నాలుగింతలు చేయమని కోరాడు. అయితే ఈ సారి దేవతాకన్య అతని కోరిక తీర్చకుండా ఇంకేదైనా కోరుకోమని చెప్పింది.

"నా కదే కావాలి.." పట్టుబట్టాడతను.

"నీ మంచికే చెప్తున్నాను. అది తప్ప ఇంకేదైనా కోరుకో.." చెప్పిందామె.

"అహా.. నువ్వు నాకోరిక తీర్చకపోతే నిన్ను వదలను.."

ఆమె ఎంత వద్దన్నా అతను వినకపోవడంతో ఆమె చిన్నగా నిట్టూర్చి "సరే.. నీ కోరిక తీరు గాక.!" అన్నది.

వెంటనే మూడోవాడు అమ్మాయిగా మారిపోయాడు..!!

❀❀

# చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

.

"ఒరేయ్ అశోక్ కిటికీ విరగ్గొట్టినందుకు వంద గుంజీలు తియ్యి" కోపంగా అన్నాడు టీచర్.

"మిగతావాళ్ళని కూడా తియ్యమనండి సార్"

"కిటికీ విరగ్గొట్టింది నువ్వేగా. వేరేవాళ్ళకెందుకు శిక్ష?"

"కష్టసుఖాలు అందరూ సమానంగా పంచుకోవాలని నిన్న మీరేగా చెప్పారు."

***

సినిమాహాల్లో గుసగుసలాడుతున్న ఓ జంటతో వెనుక వరుసలో కూర్చున్న వ్యక్తి అన్నాడు విసుగ్గా –

"అబ్బ అసలేమీ వినబడటంలేదు."

"అలాగా! మా మాటలు మీరెందుకు వినాలసలు?" కోపంగా అడిగాడు ఆ జంటలోని యువకుడు.

***

"ఇన్‌స్పెక్టర్‌గారూ!సరిగ్గా ఇవాల్టికి రెండు నెలల క్రితం మావారు బంగాళాదుంపలు కొనడానికని మార్కెట్‌కెళ్ళి యింతవరకు తిరిగి రాలేదు. ఏం చేయమంటారు?"

"ఓష్ దానిదేముంది? ఇంకో కూరేదయినా వండుకోండి."

***

"అబ్బ ఈరోజు రోడ్డు మీద ఇన్ని కాయితాలు ఉన్నాయేమిటి?"

"రోడ్లను శుభ్రంగా ఉంచమని మన మున్సిపాలిటీవారు ప్రజలకు విజ్ఞాపనా పత్రాలు జోరుగా పంచి పెట్టార్లే."

***

"బాబూ! కుంటివాణ్ణి.. ధర్మం చేయండి."

"అదేమిటి నీ కాళ్ళు బాగానే వున్నాయిగా?"
"జీవితమనే పరుగు పందెంలో ఓడిపోయి కూలబడిపోయాను. నడవలేను బాబూ!"

పోలీస్ స్టేషన్‌కి వగరుస్తూ వచ్చిన ఓ ఆగంతకుడు –
"ఇవిగో సార్! ఈ తాళాల గుత్తి మీ దగ్గరుంచండి" అన్నాడు ఇన్‌స్పెక్టర్‌తో.
"ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు ఇన్‌స్పెక్టర్.
"ఈ రోజు సాయంత్రం ఓ మందుపార్టీకి వెళ్తున్నాను. ఆ పార్టీలో ఎలాగూ పీకల్దాకా తాగటం, ఆ పైన రోడ్డుమీద ఒళ్ళెరక్కుండా గంతులేయడం, ఆపైన పోలీసులు స్టేషన్‌కు లాక్కువచ్చి రిమాండ్‌లో ఉంచడం, అటుపైన మత్తు వదిలాక మీరు వదిలేయడం ఎలానూ తప్పదు. ఈ సందట్లో మా యింటి తాళాలు ఎక్కడైనా పోవచ్చుకదా! మీ దగ్గరుంటే ఏ భయం ఉండదని."

"ఈసారి తాగుబోతులకు పెట్టే తాగుడు పోటీలో అభ్యర్థులంతా ముందే తమ పేరు, అడ్రసు రాసివ్వాలట."
"ఎందుకు?"
"కిందటిసారి గెలిచిన అభ్యర్థి పేరు తెలుసుకోవటానికి వారం రోజులపాటు అతగాడి మత్తుదిగేదాకా ఆగవలసి వచ్చిందిలెండి."

జీవితం మీద విరక్తితో ఉరివేసుకోవాలనుకున్నాడు రమేశ్.
"ఒకవేళ ఉరివేసుకున్నప్పుడు తాడు తెగిపోతే ఎలా?" సందేహంగా అడిగాడు మిత్రుడిని.
"మరేం ఫర్లేదు. మా ఇంట్లో చాలా తాళ్ళున్నాయి. స్నేహితుడికి ఆ మాత్రం సాయం చేయలేనా?" ఓదార్చాడు మిత్రుడు.

"సుబ్బారావెక్కడుంటాడో తెలుసా?"
"ఏ సుబ్బారావు? అతడికేమైనా నలుగురు పిల్లలా!"
"ఆ...అవును."
"వాళ్ళావిడ చనిపోయింది గదూ?"
"అవును. అతడే."
"చాలామందికి బాకీలు కూడా ఉన్నాడు.
"సరిగ్గా చెప్పారు. దయచేసి అతణ్ణి చూపిస్తారా?"
"భలేవాడివే! నేనుకూడా అతగాడి దగ్గర్నుంచి బాకీ వసూలు చేసుకోడానికి వచ్చినవాణ్ణే. రెండు రోజుల్నించి తిరుగుతున్నా మనిషి పత్తాలేదు."

నేను గడియారం ముందుంచుకుని మరీ తాగుతాను. నువ్వు కూడా అలా చేయరాదూ?" అన్నాడో సారా రాయుడు పీపారాయుడితో.
"గడియారం ఏం ఖర్మ. చేతిలో పైసలుండాలేగానీ ఓ పీపా ముందుంచుకునే తాగగలను."

"ఇటు ఇంగ్లీషువారి ఓడలు, అటు పక్క ఫ్రెంచివారి ఓడలు తలపడి భయంకర పోరాటం సాగించాయి. వారి సైన్యం ధాటికి రేగిన దుమ్మూ ధూళితో ఆ ప్రదేశమంతా నిండిపోయింది.." చెప్పుకుపోతోంది టీచర్.
"సముద్రం మీద దుమ్మూ ధూళి ఎలా వస్తాయి? అక్కడ నీళ్ళుంటాయికదా?" ఆశ్చర్యంగా ప్రశ్నించిందో విద్యార్థిని.
"నోర్మూసుక్కూర్చో! పుస్తకంలో అలా ఉంది. పరీక్షల్లో అలా రాస్తేనే మంచి మార్కులొస్తాయి" కసురుకుంది టీచర్.

★★★

COMMENTS